నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 28 మార్చి 2025 | HYDERABAD



నిజాంపేటలోని సర్వే నంబర్. 191 ప్రభుత్వ భూమిలో వెలసిన ఆక్రమణలను మండల రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. ఈ సందర్భంగా 191 లోని షెడ్డుతో పాటు ప్రహరీలను నేలమట్టం చేశారు. - దుండిగల్, మార్చి 27



నగరంలో గురువారం జరిగిన పాస్టర్ ప్రవీణ్ అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన క్రైస్తవులు

# అట్టడుగుకు రియాల్టీ

- తొలి త్రైమాసికంలోనూ 49 శాతం పడిపోయిన అమ్మకాలు
- అనరాక్ నివేదికలో వెల్లడి
- ఆఫీస్ స్పేస్‌లోనూ కొనసాగుతున్న డౌన్ ట్రెండ్

సిటీబ్యూరో: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, అస్పష్టమైన ఆలోచనలు, వివాదస్పదమైన హైడ్రా లాంటి నిర్ణయాలు, పేదల నడ్డి విరిచేలా అమలు చేసిన ప్రకటనలతో నింగిలో ఉండే రియల్ ఎస్టేట్ చుక్క నేలరాలింది. ఏ గడియలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందో తెలియదు కానీ తమ పరిస్థితి అత్యంత దయనీయమైనంగా మారిందని, నెత్తినోరు మోదుకొవాల్సిన దుస్థితి వచ్చిందని రియల్ వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారుల దీనవస్థలకు అద్దం పట్టేలా నగరంలో హైదరాబాద్ రియల్ ట్రెండ్‌పై వస్తున్న నివేదికలు కూడా అదే విధంగా వాస్తవాలను చూపుతున్నాయి. రేవంత్ రెడ్డి సర్కారు మాత్రం 'లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చాం. విస్తృతంగా కొత్త కంపెనీలు వస్తున్నాయి. ఊహకందని తీరుగా తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతున్నది. ఫ్యూచర్ సిటీ పేరిట కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు, విస్తృతమైన వ్యాపార అవకాశాలు' అంటూ ఊదరగొడుతున్నది. కానీ వాస్తవ పరిస్థితులు మాత్రం రియల్ ఎస్టేట్ రంగానికి కాంగ్రెస్ పాలన ఓ పీడకలలా మారిందనే అభిప్రాయం అన్ని వర్గాల్లో వ్యక్తమవుతున్నది. తాజాగా ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ వెల్లడించిన నివేదిక హైదరాబాద్ నగరంలో ఏకంగా 49 శాతం మేర ఇండ్ల అమ్మకాలు పడిపోయాయని, దేశంలోనే అన్ని మెట్రో నగరాల కంటే హైదరాబాదే అట్టడుగున ఉందని తేల్చింది.

### 2009-12లోనూ..

2009-12 సమయంలోనూ ఇదే తీరుగా రియల్ ఎస్టేట్ సంక్షోభంలో కూరుకుపోతే... తెలంగాణ ఏర్పాటుతో బీఆర్‌ఎస్ సర్కారు జీవం పోసింది. కొన ఊపిరితో ఉన్న తెలంగాణను ప్రణాళికాబద్ధమైన విధానాలతో అభివృద్ధి చేస్తూ... హైదరాబాద్ కేంద్రంగా ఎకరం వంద కోట్లకు విక్రయించుకునే స్థాయికి తీసుకెళ్లింది. గడిచిన పదేండ్లలో హైదరాబాద్ కేంద్రంగా సాగిన రియల్ ట్రెండ్‌తో... విదేశీ సంస్థలు సైతం లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వచ్చాయి. అలా దేశంలో ఏ మెట్రో నగరంలో లేనట్లుగా అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్ నగరంలో తమ కార్పొరేట్ కార్యాలయాలను ప్రారంభించుకునే వేదికను చేసుకున్నాయి. కానీ 2023 డిసెంబర్‌లో రేవంత్ ముఖ్యమంత్రి పగ్గాలు తీసుకోవడంతో మంచు ముద్దలా రియల్ ఎస్టేట్ ఆశలన్నీ నీరుగారిపోతూనే ఉన్నాయి.

### మసకబారుతున్న రియల్ వైభవం..

ప్రణాళికబద్ధమైన అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రాధాన్యతనివ్వడంతో పెట్టుబడిదారుల విశ్వసనీయత పెరిగింది. దీంతో హైదరాబాద్ కేంద్రంగా వచ్చే 15-20 ఏళ్ల పాటు మార్కెట్‌కు ఢోకా లేకుండా దూసుకుపోయింది. నగరానికి మణిహారం లాంటి ఓఆర్ఆర్ దాటి రియల్ కార్యాకలాపాలు విస్తరించాయి. ముఖ్యంగా సిటీ నలుమూలాల ప్రభుత్వం చేపట్టిన ఎన్నో విప్లవాత్మక మార్పులతో హైదరాబాద్ కేంద్రంగా రియల్ ఎస్టేట్ జాతీయ స్థాయిలో ఘనమైన చరిత్రను సొంతం చేసుకున్నది. ప్రభుత్వం నిర్వహించిన భూముల వేలానికి కూడా అనూహ్య స్పందన రావడంతో ఎకరం వంద కోట్లకు విక్రయించే స్థాయికి ఎదిగింది. ఇంత గొప్ప స్థాయికి ఎదిగిన హైదరాబాద్ రియల్ వైభవం కాస్తా ఏడాదిన్నర కాలంగా మసకబారుతూనే ఉంది. ఇందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత, కుట్రపూరిత నిర్ణయాలేనని రియల్ వర్గాలు బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. గర రియల్ ఎస్టేట్ రంగానికి ఆయువుపట్టు లాంటి ఇంటి నిర్మాణ రంగం హైడ్రా దెబ్బకు కోలుకోలేని పరిస్థితిలో ఉంది.

### కుండ బద్ధలు కొట్టిన అనరాక్ నివేదిక..

దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో మోస్తరు స్థాయిలో ఉందని ప్రముఖ నిర్మాణ రంగ అధ్యయన సంస్థ అనరాక్ వెల్లడించింది. హైదరాబాద్‌లో మాత్రం అమ్మకాలు 49శాతం పడిపోతాయని తేల్చింది. తొలి త్రైమాసికంలో జరిగిన అమ్మకాలపై నివేదికను రూపొందించగా... గతేడాదిలో పోల్చితే 9వేల యూనిట్ల అమ్మకాలు తగ్గే అవకాశం కనిపిస్తుందని పేర్కొంది. గతేడాది మొదటి త్రైమాసికంలో 19660 యూనిట్ల నుంచి 10వేల యూనిట్లకు పడిపోతుందని వెల్లడించింది. మిగిలిన మెట్రో నగరాల కంటే హైదరాబాద్‌లోనే దారుణంగా అమ్మకాలు పడిపోతాయని అంచనా వేయడం కలవరపెడుతోంది. ప్రాప్‌ఈక్విటీ సంస్థ వెల్లడించిన నివేదికలోనూ 47శాతం మేర అమ్మకాలు పడిపోగా అన్ని మెట్రో నగరాల కంటే దారుణంగా హైదరాబాద్ మార్కెట్ ఉందని తేల్చింది.

### ఆర్థిక సంక్షోభానికి మించిన డౌన్ ఫాల్

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మొదలైన రియల్ ఎస్టేట్ అమ్మకాల క్షీణత.. 2009-12 మధ్యన ఎదురైన ఆర్థిక సంక్షోభం కంటే దారుణంగా అమ్మకాలు పడిపోయాయి నివేదికలు చెబుతున్నాయి. ఈ రియల్ సంక్షోభం కేవలం గృహ నిర్మాణాలకే పరిమితం కాకుండా, ఆఫీస్ స్పేస్ అమ్మకాలోనూ ఉందని మరో నివేదికలో పేర్కొంది. ఐటీ కారిడార్ కేంద్రంగా పుష్కలంగా అందుబాటులో ఆఫీస్ స్పేస్‌కు కూడా డిమాండ్ లేదని నివేదికలు వెల్లడించాయి. ఈ లెక్కన కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడుల ప్రవాహాన్ని కూడా అనుమానించాల్సిన పరిస్థితి నెలకొంది.



# ఆర్టీఏ సేవల్లో గందరగోళం

- కార్యాలయాలకు రాకుండా పనికావట్లే
- అస్తవ్యస్తంగా స్లాట్, పన్ను చెల్లింపులు, ఫ్యాన్సీ బిడ్డింగ్ ప్రక్రియలు

**'రాజు అనే వ్యక్తి లైసెన్స్ కోసం స్లాట్ బుక్ కోసం ఆర్టీఏ వెబ్ సైట్‌లోకి వెళ్లాడు. వివరాలన్నీ ఇచ్చాడు. పేమెంట్ ప్రక్రియ పూర్తి చేశాడు. ఖాతా నుంచి డబ్బులు సేవకు సంబంధించినంత వెళ్లాయి. కానీ పేమెంట్ పూర్తయినట్టు వెబ్‌సైట్‌లో చూపించలేదు. ఇప్పుడు అతడికి స్లాట్ బుక్ అయిందా? లేదా? డబ్బులు చెల్లించినట్టు సందేశం ఎలా? అనే చిక్కులు వచ్చిపడ్డాయి.'**

**'ప్రకాశ్ ఫ్యాన్సీ నంబర్ కోసం బిడ్డింగ్‌లో పాల్గొన్నాడు. నంబర్‌కు సంబంధించిన అమౌంట్‌ను చెల్లించాడు. ఖాతా నుంచి డబ్బులు డ్రా అయ్యాయి. కానీ అందుకు సంబంధించిన సందేశం మాత్రం రాలేదు. బిడ్డింగ్‌లో పోటీలో ఉన్నప్పటికీ లింక్ ఓపెన్ చేసే క్రమంలో సాంకేతిక సమస్యలు వచ్చాయి. దీంతో అతడు నచ్చిన నంబర్ కోల్పోయాడు.**

సిటీబ్యూరో: ఆర్టీఏలో సాంకేతిక సమస్యలు తిష్టవేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్లాట్ బుక్, వాహన పన్ను చెల్లింపులు, ఫ్యాన్సీ నంబర్ల బిడ్డింగ్ తదితర ప్రక్రియల్లో వాహనదారులు ఆన్‌లైన్ సేవలను ఉపయోగించుకోవడానికి ప్రయత్నిస్తుంటే ఖాతాల నుంచి డబ్బులు ఖాళీ అవుతున్నాయి. కానీ కన్ఫర్మేషన్ సందేశాలు ఎలాంటివి కూడా రావడం లేదు. దీంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఆ వివరాలన్నీ పట్టుకొని ఆర్టీఏ అధికారుల వద్దకు వెళితే ఆన్‌లైన్ సర్వర్‌కు సంబంధించిన విషయం కాబట్టి కొంత సమయం పడుతుందని చెప్పి చేతులు దులుపుకొంటున్నారు. ఆన్‌లైన్ సేవల్లో ఛార్జీ రూ. 10తో ముగిస్తే.. మీ సేవలో సుమారు 35 రూపాయల వరకు అదనంగా ఉంటుంది. ఆన్‌లైన్ సేవలపై రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో క్షేత్రస్థాయి ఆర్టీఏ కార్యాలయాల్లో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలు వాహనదారుల పాలిట శాపంగా మారాయి.

### టీ యాప్ ఫోలియో ద్వారా..

కేసీఆర్ పాలనలో టీ యాప్ ఫోలియో ద్వారా ఆర్టీఏ ఆన్‌లైన్ సేవలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఆర్టీఏ కార్యాలయానికి రాకుండానే సుమారు ఆర్టీఏలో 17 సేవలను ఆన్‌లైన్ ద్వారా అందించారు. అయితే ఇప్పుడు ఆన్‌లైన్ సేవలపై అధికారులు పర్యవేక్షించకపోవడంతో వాహనదారులు కార్యాలయాలు చుట్టు తిరిగి.. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తున్నది. మహేశ్ అనే వ్యక్తి వెహికల్ ట్రాన్స్‌ఫర్, స్లాట్ బుకింగ్‌కు సంబంధించిన వర్క్‌లో ఆన్‌లైన్‌లో వెయ్యికిపైగా ఫీజు చెల్లించాడు. అప్‌డేట్ కాలేదు. అతడు మళ్లీ మీసేవకు వెళ్లి డబ్బులు చెల్లించాల్సి వచ్చింది. ఆన్‌లైన్‌లో చెల్లించినట్టు అధికారుల దృష్టికి తీసుకెళితే కన్ఫర్మేషన్ సందేశం చూపించాలని ఎదురు ప్రశ్నించడంతో కంగుతినాల్సి వచ్చింది.







# ఉరిమిన ఉత్సాహం

ఉప్పల్ వేదికగా గురువారం సన్‌రైజర్స్ హైదరాబాద్ - లక్నో సూపర్ జెయింట్స్ మధ్య జరిగిన మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రీడాభిమానులు భారీగా తరలివచ్చారు. తమ అభిమాన ప్లేయర్స్‌ను కేరింతలతో ఉత్సాహపరిచారు.









# పనులన్నీ వదిలి.. పన్నులపైనే దృష్టి

సిటీబ్యూరో: ఆస్తిపన్ను నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు బల్దియా అపసోపాలు పడుతున్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2వేల కోట్ల లక్ష్యాన్ని టార్గెట్‌గా పెట్టుకోగా.. గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనున్నది. 19.25 లక్షల మందిలో 13.60 లక్షల మంది మాత్రమే ఆస్తిపన్ను చెల్లించగా, వీరి నుంచి రూ. 1720 కోట్ల మేర ఆదాయాన్ని రాబట్టుకున్నది. ఆస్తిపన్ను చెల్లించకుండా ఉన్న దాదాపు 5 .75లక్షల మందిపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి రూ.280 కోట్ల రాబట్టాలని భావిస్తున్నారు. ఈ మేరకు ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, డీసీలను సెలవులు రద్దు చేసిన కమిషనర్.. వసూళ్లు పెంచడమే లక్ష్యంగా రోజూవారీ సమీక్షలు పెట్టి టార్గెట్లు ఇస్తున్నారు. ఇతర పనులకు ఫుల్‌స్టాప్ పెట్టిన జీహెచ్ఎంసీ అధికారులు ఒక్క ఆస్తిపన్ను కలెక్షన్లపైనే ప్రధాన ఫోకస్‌గా పనిచేస్తున్నారు.జీహెచ్ఎంసీ కల్పించిన వన్ టైం సెటిల్‌మెంట్ పథకానికి సద్వినియోగం చేసుకోవాలని, వడ్డీపై 90శాతం పన్ను రాయితీ పొందాలని కమిషనర్ ఇలంబర్తి సూచించారు. ఆస్తిపన్నును ఆన్‌లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్లు, ఈ -సేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చని, సర్కిల్, హెడ్ ఆఫీస్‌లో ఉన్న సిటిజన్ సర్వీస్ సెంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయని కమిషనర్ తెలిపారు.

# సైబర్ దొంగల కరెంట్ బిల్లు

- మేసేజ్‌లతో కూడిన లింక్‌లు..
- క్లిక్ చేస్తే.. డేటా హ్యాక్
- క్షణాల్లో ఖాతా ఖాళీ..
- సైబర్‌నేరస్తుల సరికొత్త మోసం
- మోసపూరిత సందేశాలు నమ్మవద్దు: సీఎండీ ముషారఫ్ ఫరూఖి

సిటీబ్యూరో, మార్చి 27 (నమస్తే తెలంగాణ): సరికొత్తగా కరెంట్ బిల్లు పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉందని, సాయంత్రంలోగా బిల్లు చెల్లించకపోతే కరెంట్ కట్ అవుతుందంటూ మెసేజ్ ఉన్న లింక్ వెంటనే ఓపెన్ చేసి బిల్లు చెల్లించాలంటూ పంపుతున్నారు. హైదరాబాద్‌లో చాలామందికి ఈ తరహ మెసేజ్‌లు వస్తున్నాయి. కరెంట్ బిల్లు కట్టిన వారికి కూడా ఇలాంటి మెసేజ్‌లు రావడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైమ్ పోలీసులకు కొందరు వినియోగదారులు ఫిర్యాదు చేశారు.






### క్షణాల్లో డబ్బులు మాయం..

లింక్ ఓపెన్ చేయగానే వారి ఫోన్ నంబర్‌కు లింక్ అయిన బ్యాంక్ అకౌంట్స్‌కు సంబంధించిన డేటా హ్యాక్ చేస్తున్నారు. క్షణాల్లోనే ఖాతాల్లోంచి డబ్బు మాయమవుతున్నది. మహారాష్ట్ర, బీహార్ నుంచి కరెంట్ బిల్లు పెండింగ్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. 8967954941 నంబర్ నుంచి వినియోగదారులకు మెసేజ్‌లు వస్తున్నాయని, ఈ నంబర్ నుంచి వచ్చిన లింక్‌లను ఓపెన్ చేయొద్దంటూ పోలీసులు సూచిస్తున్నారు. వెంటనే 8135967194 కాల్ చేయాలని, వాట్సాప్ మెసేజ్ చేయమని వచ్చినా.. స్పందించవద్దని పేర్కొంటున్నారు. ట్రూ కాలర్‌లో చెక్‌చేస్తే ఈ నంబర్ ఎలక్ట్రిసిటీ పవర్‌ఆఫీస్, కరెంట్ ఆఫీస్ అస్సాం అడ్రస్‌తో ఉన్నటు తెలుస్తోంది.

### మోసపూరిత మెసేజ్‌లు నమ్మవద్దు

**-టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి**

విద్యుత్ బకాయిలు, బిల్లుల పేరుతో కొంతమంది వ్యక్తులు తమ వినియోగదారులను ఫేక్ మెసేజ్‌లు పెట్టి మోసం చేస్తున్నారని, అటువంటి మెసేజ్‌లను వినియోగదారులు నమ్మి మోసపోవద్దని టీజీఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సూచించారు. సంస్థ పంపే మెసేజ్‌లలో విభాగం పేరు, యూఎస్‌సీ/సర్వీస్ నంబర్, వినియోగదారుని పేరు, బిల్లు ఉంటాయని తెలిపారు. అలాగే సంస్థ ఎప్పుడూ మొబైల్ నంబర్ నుంచి సందేశాలు పంపదని, సంస్థ ఉద్యోగులు వినియోగదారుల నుంచి చెల్లింపు రసీదు తప్ప బ్యాంక్ ఖాతా తదితర వివరాలు సేకరించరని అదే విధంగా సంస్థ బిల్లుల చెల్లింపు కోసం ఎలాంటి లింక్‌లు పంపదని స్పష్టం చేశారు.





# నెక్లెస్‌రోడ్‌లో నడిచేదెలా..?

నెక్లెస్‌రోడ్‌లోని ఫుట్‌పాత్ ఇలా చెత్తకుప్పగా మారింది. బల్దియా, హెచ్ఎండీఏ నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా నిలుస్తున్నది. ఫుట్‌పాత్‌పై ఎండిన ఆకులు.. వ్యర్థాలు పేరుకుపోవడంతో ఈ మార్గం మొత్తం కళాహీనంగా తయారైంది. వీటిని రోజుల తరబడి తొలగించకపోవడంతో ఫుట్‌పాత్‌పై నడవలేక.. పాదచారులు, వాకర్స్ తీవ్రంగా ఇబ్బందులుపడుతున్నారు. గత్యంతరం లేక రహదారిపై నడవాల్సి వస్తున్నదని వాపోతున్నారు.

**-ఖైరతాబాద్, మార్చి 27**

